# ప్రజాభూమి

Prajabhoomi Telugu Daily
www.prajabhoomi.com


**కులగణనను ప్రజల ముందు ఉంచుతాం**



కామారెడ్డి డిక్లరేషన్ ను సీఎం రేవంత్ అమలు చేస్తున్నరు
అన్ని కులాల లెక్కలు, వారి ఆర్థిక స్థితిగతులు తెలుస్తయ్
బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్

02


తెలంగాణ ఎడిటర్ : విప్పల చంద్రశేఖర్ | శనివారం | 02.11.2024 | పేజీలు: 06 | నమూనా సంచిక | వెల : అముల్యం




# రాష్ట్రమంతటా పాదయాత్ర

## కార్యకర్తల అభీష్టం మేరకు ప్రజాక్షేత్రంలోకి: కేటీఆర్

త్వరలో తేదీలను ప్రకటిస్తామని స్పష్టం

- రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయి
- కాంగ్రెస్ పాలన ఫ్రమ్ ఢిల్లీ, టూ ఢిల్లీ, ఫర్ ఢిల్లీగా ఉంది
- అక్రమ కేసులు పెడుతున్న పోలీసులపై కఠిన చర్యలు తప్పవు
- కేసీఆర్ ఫుల్ హెల్దీగా ఉన్నారు.. ప్రతి అంశాన్ని స్టడీ చేస్తున్నరు
- రాజకీయాల్లోకి కుటుంబ సభ్యులను లాగుతారా?
- పాలిటిక్స్ వదిలేయాలన్నంత భావోద్వేగానికి గురయ్యా
- 'ఎక్స్'లో 'ఆస్క్ కేటీఆర్'లో నెటిజన్ల ప్రశ్నలకు సమాధానాలు

### పాదయాత్ర చేస్తా అనడానికి సిగ్గుండాలి



- ఏం ఉద్ధరించారని పాదయాత్రకు వెళ్తావ్?
- ముందు ఫామ్ హౌస్ నుంచి మీ డాడీని బయటకు రమ్మను
- కేటీఆర్ ప్రకటనపై బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు
- దీపావళికి పేలిన బాంబులేవీ అంటూ ప్రశ్నలు

# కొద్ది రోజుల్లో రేవంత్ సీఎం పోస్ట్ ఊస్ట్

- వచ్చే డిసెంబర్‌లోపు ఆయన పదవి పోవడం ఖాయం
- ఢిల్లీలో తన వ్యతిరేక వర్గం లాబీయింగ్ చేస్తున్నారు
- హైకమాండ్ కు ఫిర్యాదు కూడా చేశారు
- కొత్త సీఎం కోసం అధిష్టానం అన్వేషిస్తోంది
- అందుకే రేవంత్ కు రాహుల్ అపాయింట్‌మెంట్ ఇస్తలేదు
- ముగ్గురు మంత్రులు సీఎం రేసులో పోటీ పడుతున్నరు
- కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేసీఆర్‌తో టచ్‌లో ఉన్నరు
- మీడియా చిట్ చాట్ లో బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాహుల్ గాంధీ అపాయింట్మెంట్ ఇవ్వడం లేదని బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో కొత్త ముఖ్యమంత్రి కోసం కాంగ్రెస్ అధిష్టానం అన్వేషిస్తోందని సంచలన కామెంట్స్ చేశారు. సీఎం రేవంత్‌పై సీనియర్ మంత్రులు, ఒరిజినల్ కాంగ్రెస్ నేతలు అధిష్ఠానానికి ఫిర్యాదు చేస్తున్నారని,

మిగతా 2లో..



### విద్యా శాఖకు కేసీఆర్ చేసింది శూన్యం



- వారి హయాంలో విద్య వ్యవస్థ నాశనమైంది
- పదేళ్లుగా డైట్ చార్జీలు పట్టించు కోలేదు: మంత్రి సీతక్క
- కనీసం టాయిలెట్స్, తాగునీరు, మౌలిక వసతులు కల్పించలేదని మండిపాటు
- తమ ప్రభుత్వం విద్యార్థులకు డైట్ కాస్మోటిక్ 40 శాతం పెంచిందని వెల్లడి

02



### నాగార్జునసాగర్‌లో స్టార్ హోటల్ నిర్మిస్తాం

- బుద్ధ వనాన్ని పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతాం
- యావత్ ప్రపంచానికి బౌద్ధ సంస్కృతి చాటి చెప్పాలి
- మంత్రి జూపల్లి కృష్ణారావు

02

### బీసీ కమిషనా.. కాంగ్రెస్ కమిషనా?



ఆ కమిషన్‌కు విలువలేదని **హైకోర్టు చెప్పింది**

మాకు మాట్లాడే అవకాశం కూడా ఇవ్వలే
బలహీన వర్గాలకు కాంగ్రెస్ మోసం చేస్తోంది
బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై డా. సంజయ్ ఫైర్

02

### భారత్ రాజీపడబోదు

- ఒక్క అంగుళం భూమిని కూడా వదులుకోం: ప్రధాని మోదీ
- కచ్ ప్రాంతంలో సైనికులతో దీపావళి వేడుకలు
- జవాన్లకు మిఠాయిలు తినిపించిన ప్రధాని



02

### సమగ్ర కుటుంబ సర్వేకు ప్రతి ఒక్కరు సహకరించాలి

- సర్వేతోనే అర్హులకు సంక్షేమ పథకాలు
- అన్ని రకాల స్కీమ్స్ కు ఇది మెగా హెల్త్ చెకప్
- యూజ్ అవుతుంది
- రాష్ట్ర ప్రజలకు మంత్రి పొన్నం ప్రభాకర్ బహిరంగ లేఖ



02



### జార్ఖండ్ లో కాంగ్రెస్ దే విజయం

మనమే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నాం
డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

02

### హైడ్రా కమిషనర్ కు అమీన్‌పూర్ బాధితుల ఫిర్యాదు

మోసం చేసి ప్రభుత్వ భూములను కట్టబెట్టారని బాధితుల కంప్లైంట్



02



02

### రైతులను కాంగ్రెస్ నట్టేట ముంచింది

- బోనస్ బోగస్ చేసింది
- కనీస మద్దతు ధరకు ధాన్యాన్ని కొనాలి
- ప్రభుత్వానికి హరీశ్ రావు డిమాండ్

### కేటీఆర్.. అమెరికా వెళ్లి బాత్ రూమ్ లు కడుక్కో

- మోకాళ్ల యాత్ర చేసిన ప్రజలు విశ్వసించరు
- ఫామ్‌హౌస్ కేసులో పాలేవో.. నీళ్లేవో తేలాలంటే సీపీ ఫుటేజ్ బయట పెట్టు
- కేటీఆర్ పై ఎంపీ రఘునందన్ రావు ఫైర్
- మంత్రి పొంగులేటి చెప్పినా బాంబులెక్కడ పేలాయి?

**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:**

అధికారంలో ఉన్న పదేళ్లు కేటీఆర్‌కు ప్రజలను కలిసే సమయం దొరకలేదా అని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ప్రశ్నించారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మీడియాతో మాట్లాడుతూ.. తనకు రాజకీయాలు బంద్ చేయాలని ఉందని కేటీఆర్ అన్నారని.. బంద్ చేయ్ ఎవరు

మిగతా 2లో..



## బీసీ కమిషనా.. కాంగ్రెస్ కమిషనా?

ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:

బీసీ కమిషన్‌కు విలువలేదని హైకోర్టు చెప్పిందని, అయినప్పటికీ కమిషన్‌పై గౌరవంతో తాము వచ్చామని... కానీ తమకు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కరీంనగర్ కలెక్టరేట్‌లో నిర్వహించిన బీసీ సమస్యల పరిష్కారం కోసం రూపొందించిన అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కోరుట్ల ఎమ్మెల్యే డా.సంజయ్ పాల్గొన్నారు. అయితే ఈ బహిరంగ విచారణలో తమను మాట్లాడనీయడం లేదని కౌశిక్ రెడ్డి, ఇతర బీఆర్ఎస్ నేతలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. తమకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదన్నారు. బీసీ కమిషన్ కాంగ్రెస్ కమిషన్‌లా తయారయిందని మండిపడ్డారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కమిషన్‌ను కోరినట్లు చెప్పారు. అభిప్రాయం చెప్పేందుకు బీఆర్ఎస్ తప్ప ఎవరూ రాలేదన్నారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు ఎందుకు రాలేదో చెప్పాలన్నారు. కొత్త కమిషన్ వేయాలని కోర్టు చెప్పినప్పటికీ ఈ బహిరంగ విచారణ ఎందుకు చేపరడుతున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం బలహీన వర్గాలను మోసం చేస్తోందని పేర్కొన్నారు. కానీ బలహీన వర్గాల కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీ గురుకులాలు, బీసీ బంధు వంటి పథకాలతో అండగా నిలిచిందన్నారు.

## హైడ్రా కమిషనర్ కు అమీన్ పూర్ బాదితుల ఫిర్యాదు

ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:

హైడ్రా కమిషనర్ రంగనాథ్ బాధితుల ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా శుక్రవారం అమీన్ పూర్ కు చెందిన కొంతమంది రంగనాథ్ ను కలిశారు. మాధవరెడ్డి, చంద్రశేఖర్, కోటేశ్వరరావు అనే వ్యక్తులు తమను మోసం చేసి ప్రభుత్వ భూములు కట్టబెట్టరాని ఫిర్యాదు చేశారు. అమీన్ పూర్ పరిధిలోని సర్వే నం.6 అనుమతులు చూపించి సర్వే నం. 12కు చెందిన ప్రభుత్వ భూములను ప్లాట్లుగా చేసి తమకు అమ్మారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమను మోసం చేసి ప్రభుత్వ భూములు అంటగట్టిన వారి నుంచి తమ డబ్బులు తిరిగి ఇప్పించాలని కమిషనర్ వద్ద కన్నీటి పర్యంతం అయ్యారు. అలాగే అమీన్‌పూర్ మండలంలోని పెద్ద చెరువు అలుగులు మూసేసి.. ఎగువ వైపు తమ స్థలాల్లోకి చెరువు నీరు వచ్చేలాచేశారంటూ మరికొంతమంది ఫిర్యాదు చేశారు. పెద్ద చెరువు నీరు కింద ఉన్న బండికుంట చెరువుకు వెళ్లే లా కాకుండా.. అటువైపు అలుగులు మూసేయడంతో ఎగువవైపు నీరు పారుతుండడంతో తమ ఇళ్ల స్థలాలు కోల్పోయామంటూ పేర్కొన్నారు. సర్వేనంబరు 153లోని హుడా అనుమతి పొందిన లే ఔట్లో ఉన్న పార్కు స్థలాన్ని పక్కనే కొత్తగా వెంచర్ వేస్తున్న వారు కబ్జా చేశారంటూ అమీన్‌పూర్ మండలంలోని వెంకటరమణా కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. సర్వే చేయించి తమ పార్కుతో పాటు.. లే ఔట్ లోని రహదారులను కాపాడాలంటూ విన్నవించారు. ఈ విషయాలపై తగిన విచారణ జరిపించి, పూర్తి న్యాయం చేకూరుస్తానని రంగనాథ్ వారికి హామీ ఇచ్చారు.

# రాష్ట్రమంతటా పాదయాత్ర

ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:

రాష్ట్రంలో గులాబీ పార్టీ రాజకీయంగా తీవ్ర ప్రతికూల ప్రభావం ఎదుర్కొంటున్న వేళ ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. తాను ప్రజాక్షేత్రంలోకి వెళ్తానని, పాదయాత్ర చేస్తానని సంచలన ప్రకటన చేశారు. అధికారం కోల్పోయిన తర్వాత కారు పార్టీ చాలా ఇబ్బందులు పడుతోంది. అధికార పార్టీ నుంచి వస్తున్న మాటల యద్ధాన్ని ఎదుర్కోలేక పోతోంది. దీంతో నేరుగా ప్రజల్లోకి వెళ్లడమే ఉత్తమని భావించింది. కేటీఆర్ పాదయాత్ర చేస్తానని ప్రకటించడంతో ఓ వైపు బీజేపీ, మరోవైపు కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించారు. 'ఎక్స్'లో 'ఆస్క్ కేటీఆర్' పేరిట నెటిజన్ల నుంచి ప్రశ్నోత్తరాలు నిర్వహించారు. నెటిజన్లు అడిగిన ప్రశ్నలకు కేటీఆర్ సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వ్యక్తిగతంగా.. రాజకీయంగా.. సమకాలీన పరిణామాలపై కేటీఆర్ స్పందించారు. దాదాపు గంటన్నరపాటు కేటీఆర్ ప్రశ్నోత్తరాలకు సావధానంగా సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణకు శాపం. ఫ్రమ్ ఢిల్లీ, టూ ఢిల్లీ, ఫర్ ఢిల్లీ అన్నట్లుగా తయారైంది' అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పాలనలో జరిగిన పతనం నుంచి తెలంగాన కోలుకోవడం అసాధ్యమని పేర్కొన్నారు. ప్రజల పక్షాన కోట్లాడడమే ప్రస్తుత బాధ్యత తమపై ఉందన్నారు. బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని పూర్తి విశ్వాసం వ్యక్తం చేశారు.

**రాజకీయాలు వదిలేయాలనుకున్న..**

పార్టీ కార్యకర్తలు అందరూ కోరుకుంటుండడంతో కచ్చితంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తృత స్థాయి పాదయాత్రను నిర్వహిస్తానని కేటీఆర్ ప్రకటించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ బలోపేతం, మాజీ సీఎం కేసీఆర్ ఆరోగ్యం వంటి వాటిపై కేటీఆర్ స్పందించారు. 'కేసీఆర్ సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారు. పార్టీకి మార్గదర్శకత్వం చేస్తున్నారు' అని వివరించారు. పార్టీ నేతలపై వేధింపులు.. అక్రమ కేసులు పెడుతున్న పోలీసులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని ఆవేదన వ్యక్తం చేశారు. 'అబద్ధపు హామీల మీద ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ నుంచి ఇంతకంటే గొప్ప పరిపాలన ఆశించలేం. అయితే వీటికి భయపడేది లేదు' అని కేటీఆర్ హెచ్చరించారు. సన్న వడ్లకు కూడా బోనస్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ హామీ బోగస్‌గా మారిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మి ఓట్లు వేసి మద్దతు ధర లేక రైతుబంధు లేక నష్టపోతున్న రైతన్నల తరఫున పోరాడుతామని స్పష్టం చేశారు. రేవంత్ పాలనలో అన్ని రంగాల్లో తెలంగాణ వెనక్కి పోతోందని తెలిపారు. ఐదు సంవత్సరాల కోసం కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇచ్చారు కాబట్టి దాన్ని గౌరవించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తన బావ మరిది ఇంట్లో జరిగిన దావత్‌పై పరోక్షంగా కేటీఆర్ స్పందించారు. 'మేము అధికారంలో ఉన్న పదేళ్లలో ఏనాడు ఇతరుల కుటుంబసభ్యులను రాజకీయ అంశాల్లోకి లాగలేదు. రెండు దశాబ్దాల తన రాజకీయ జీవితంలో కుటుంబసభ్యులను అవహేళన చేసి మాట్లాడినప్పుడు రాజకీయాలు వదిలేయాలన్నంత భావోద్వేగానికి గురయ్యా. కేవలం రాజకీయాల కోసం ఇతరుల కుటుంబ సభ్యులను ఎందుకు లాగుతారో అర్థం కాదు. ఈ విషయం అత్యంత బాధ కలిగిస్తుంది' అని కేటీఆర్ తెలిపారు.

**పాదయాత్ర చేసే దమ్ము కాంగ్రెస్ ఉందా: బండి సంజయ్**

కేటీఆర్ పాదయాత్రపై కేంద్రమంత్రి బండి సంజయ్ స్పందిస్తూ ఆయనపై విమర్శలు గుప్పించారు. పనిలో పనిగా కాంగ్రెస్ ప్రభుత్వంపైనా మండిపడ్డారు బండి సంజయ్. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. పాదయాత్ర చేస్తా అనడానికి సిగ్గు ఉండాలన్నారు. ఏం ఉద్ధరించారని పాదయాత్ర చేస్తా అంటున్నవ్ కేటీఆర్ అని ప్రశ్నించారు. ''మేం పాదయాత్ర చేస్తే దాడులు చేశారు. ముందు కేసీఆర్‌ను ఫామ్ హౌస్ నుంచి బయటకు రమ్మను. తాగి, తింటూ కేసీఆర్ ఎంజాయ్ చేస్తున్నాడు. నాయకుడు లేని నావ బీఆర్ఎస్. కేటీఆర్‌ను జనం ఛీధరించుకుంటున్నారు'' అంటూ వ్యాఖ్యలు చేశారు. ఆరు గ్యారంటీలను అమలు చేశామని పాదయాత్ర చేసే దమ్ము కాంగ్రెస్ ఉందా అని ప్రశ్నించారు. రైతు భరోసా ఉందో లేదో తెల్వదని. బోనస్ ఇస్తారో లేదో చెప్పరని మండిపడ్డారు. 29 జీవోను రద్దు చేయకపోతే ఊరుకోమని హెచ్చరించారు. ఏడాది పాలనలో ఒక్క హామీ అమలు కాలేదన్నారు. కర్ణాటకలో ఉచిత బస్సు పథకం రద్దు చేస్తున్నారన్నారు. దీపావళికి ఏవో బాంబులన్నారని.. ఇప్పుడు సైలెంట్ అయ్యారన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటే.. స్కాములన్నీ ఏమయ్యాయో చెప్పాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.



# కొద్ది రోజుల్లో రేవంత్ సీఎం పోస్ట్ ఊస్ట్

(మొదటి పేజీ తరువాయి)

రేవంత్ హాలీడే పీరియడ్ అయిపోయిందని ఆరోపించారు. సీఎం రేవంత్‌కు కౌంట్ డౌన్ మొదలైంది అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి మీడియా చిట్‌చాట్‌లో.. రేవంత్ హాలీడే పీరియడ్ అయిపోయింది.. కౌంట్ డౌన్ మొదలైంది. 2025 జూన్ నుంచి డిసెంబర్‌లోపు రేవంత్ పదవి పోవడం ఖాయమని, రేవంత్ రెడ్డికి ప్రత్యామ్నాయ కోసం కాంగ్రెస్ అధిష్ఠానం చూస్తోందన్నారు. ఒరిజినల్ కాంగ్రెస్ నేతలు రేవంత్‌పై అధిష్ఠానానికి ఫిర్యాదు చేస్తున్నారని, రేవంత్ వ్యతిరేక వర్గం ఢిల్లీలో లాబీయింగ్ చేస్తున్నారని, మేనిఫెస్టోను కాదు అని.. సొంత ఎజెండాను రేవంత్ అమలు చేస్తున్నారన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యామ్నాయం ఎవరు అని కాంగ్రెస్ అధిష్ఠానం ఆలోచన చేస్తోందని వ్యాఖ్యానించారు. సీనియర్ మంత్రులు హైడ్రా, మూసీ, ల్యాండ్ సెటిల్‌మెంట్ల మీద రేవంత్‌పై ఫిర్యాదు చేసినట్లు తమ దగ్గర సాక్ష్యాలు ఉన్నాయన్నారు.



**ఆ ఐదుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేసీఆర్‌తో టచ్‌లో..**

సీనియర్ మంత్రులు చేసిన ఫిర్యాదుపై కాంగ్రెస్ అధిష్ఠానం సీరియస్‌గా ఉందని ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. మూసీ ప్రాజెక్టు కాస్ట్ మూడు వంతులు పెంచి.. రేవంత్ స్వార్థం కోసం కాంగ్రెస్‌ను వాడుకుంటున్నారని చెప్పారు. 'సీఎం రేవంత్ ఏకపక్ష ధోరణికి చాలా మంది నేతలు ఒప్పుకోవడం లేదు. రేవంత్ ఏడు సార్లు ఢిల్లీకి వెళ్లినా రాహుల్ అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదు. 11 నెలలు దాటింది.. ఏడాదిన్నర లోపే కాంగ్రెస్ కొత్త ముఖ్యమంత్రి రావడం ఖాయం. భట్టి విక్రమార్క నేను సైతం సీఎం రేసులో ఉన్నానని చెప్పడానికి చెరువుల కబ్జాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇవ్వడమే ఒక ఉదాహరణ. ముగ్గురు మంత్రులు సీఎం రేసులో పోటీ పడుతున్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పక్కా సమాచారంతోనే మాట్లాడారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రి అవుతారు అని.. నా నాలుకపై పుట్టుమచ్చ ఉందని ముందుగానే పసిగట్టి ఆయన ఇలా మాట్లాడారు. ముఖ్యమంత్రి పదవి రేసులో ఉత్తమ్, కోమటిరెడ్డి, భట్టి విక్రమార్క ముగ్గురూ పోటీ పడుతున్నారు. అలాగే, కాంగ్రెస్‌లో చేరిన ఐదుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేసీఆర్‌తో టచ్‌లో ఉన్నారని' అంటూ కామెంట్స్ చేశారు.

# నాగార్జునసాగర్‌లో స్టార్ హోటల్ నిర్మిస్తాం

ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:

నాగార్జున సాగర్ ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడం వల్ల ఆదాయంతో పాటు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మంత్రి జూపల్లి తెలిపారు. నాగార్జునసాగర్ బుద్ధవనం పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంలో స్టార్ హోటల్ నిర్మాణంతో పాటు, వాటర్ స్పోర్ట్స్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. శుక్రవారం ఆయన నల్గొండ జిల్లా నాగార్జునసాగర్ వద్ద ఉన్న బుద్ధవనం పరిసర ప్రాంతాలను శ్రీ రామచంద్ర మిషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కమలేష్ డి.పాటిల్ (దాజి)తో కలిసి పరిశీలించారు. ముందుగా విజయ విహార్‌లో బుద్ధవనం లేఅవుట్, విజయ విహార్ లేఔట్లను పరిశీలించారు. మొత్తం 270 ఎకరాల విస్తీర్ణంలో వ్యాపించి ఉన్న బుధవనంలో ఉన్న విశేషాలను రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాష్ రెడ్డి, బుద్ధవనం కన్సల్టెంట్ శివనాగిరెడ్డి మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. నాగార్జునసాగర్‌లో ప్రసిద్ధ బౌద్ధ క్షేత్రాన్ని గొప్పగా నిర్మించారని ఆయన తెలిపారు. ఆచార్య నాగార్జునుడు తిరిగిన ఈ ప్రాంతాన్ని అంతర్జాతీయ బౌద్ధ క్షేత్రంలో మరింత అభివృద్ధి చేస్తామని, సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో బుద్ధవనం ను పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. బౌద్ధ టూరిజం సర్క్యూట్ లో తెలంగాణలోని బుద్ధవనం ను అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానని, యావత్ ప్రపంచానికి బౌద్ధ వారసత్వ, సంస్కృతిని చాటి చెప్పాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. బౌద్ధ టూరిజం సర్క్యూట్‌లో తెలంగాణలోని బుద్ధవనం ను అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తామన్నారు. బుద్ధుడి సమగ్ర జీవిత చరిత్రను ఒకే ప్రదేశంలో ఆవిష్కరించేలా నాగార్జునసాగర్‌లో ప్రసిద్ధ బౌద్ధ క్షేత్రాన్ని గొప్పగా నిర్మించారని కొనియాడారు. నాగార్జున సాగర్ ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడం వల్ల ఆదాయంతో పాటు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మంత్రి జూపల్లి తెలిపారు. ఆచార్య నాగార్జునుడు నడయాడిన ఈ ప్రాంతాన్ని ప్రజలు తప్పక సందర్శించాలని విజ్ఞప్తి చేశారు.

## రైతులను కాంగ్రెస్ నట్టేట ముంచింది

ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:

లారీల కొరత కారణంగా కాంటా వేయక పోవడంతో, నల్గొండ జిల్లా కట్టంగూర్ ప్రభుత్వ కొనుగోలు కేంద్రానికి తెచ్చిన ధాన్యాన్ని రైతులు మిల్లర్లలో అమ్ముకునేందుకు తిరిగి తీసుకెళ్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు స్పందిచారు. శుక్రవారం ఎక్స్ వేదికగా తెలంగాణ కాంగ్రెస్ మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన హామీల ఫోటోను పోస్ట్ చేశారు. లాభసాటి వ్యవసాయమని, అన్ని పంటలకు బోనస్ అని, హామీ ఇచ్చి రైతులను నట్టేట ముంచింది కాంగ్రెస్ పార్టీ అని హరీశ్ రావు ఆరోపించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కనీస మద్దతు ధరకు ధాన్యాన్ని అమ్ముకోలేని దుస్థితికి రైతును దిగజార్చిన రేవంత్ సర్కార్.. బోనస్ బోగస్ అయ్యిందన్నారు.

# విద్యా శాఖకు కేసీఆర్ చేసింది శూన్యం

ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:

విద్యా శాఖకు కేసీఆర్ ప్రభుత్వం చేసింది శూన్యమని, వారి హయాంలో విద్య వ్యవస్థ నాశనమైందని పంచాయతీరాజ్ గిరిజన అభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క విమర్శించారు. విద్యార్థుల బాధలు తెలిసిన రేవంత్ రెడ్డి సీఎంగా ఉన్నారని తెలిపారు. విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉండాలనే లక్ష్యంతో రేవంత్ రెడ్డి పని చేస్తున్నారని ఉద్ఘాటించారు. అందుకే ఎన్నడూ లేని విధంగా హాస్టల్, గురుకుల విద్యార్థులకు డైట్ కాస్మోటిక్ 40 శాతం పెంచారని గుర్తు చేశారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా విద్యార్థులకు 40 శాతం చార్జీలను పెంచిన సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. డైట్ చార్జీలు ఏడేళ్లుగా, కాస్మోటిక్ ఛార్జీలు గత 16 సంవత్సరాలుగా పెరగలేదని అన్నారు. ఏడు సంవత్సరాల క్రితం డైట్ చార్జీలు కొంచెం పెంచి.. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రచారం చేసుకుందని మండిపడ్డారు. ఏడేళ్లుగా ధరలు విపరీతంగా పెరిగిన అనుగుణంగా డైట్, కాస్మోటిక్ ఛార్జీలు ఎందుకు పెంచలేదని ప్రశ్నించారు.

విద్యార్థులు అర్థాకలితో ఇబ్బందులు పడ్డారు..

డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచకపోవడంతో పిల్లలు అర్ధాకలితో ఇబ్బందులు పడ్డారని మంత్రి సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్లు అధికారంలో ఉండి టాయిలెట్స్ కట్టలేదని.. తాగునీరు, మౌలిక వసతులు కల్పించలేదని ధ్వజమెత్తారు. ఈ సమస్యలను గుర్తించిన సీఎం రేవంత్ రెడ్డి పాఠశాలల్లో మౌలిక సదుపాయల కల్పన కోసం ప్రత్యేక దృష్టి పెట్టారని అన్నారు. డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచడంతో 7.65 లక్షల మంది విద్యార్థులకు లబ్ది జరగనుందని వివరించారు. పిల్లలకు కడుపునిండా భోజనం పెట్టాలని పెరిగిన ధరలకు అనుగుణంగా డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచిన సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. హాస్టల్ విద్యార్థులు అర్ధాకలితో అవస్థలు పడాల్సిన అవసరం లేదని చెప్పారు. పెంచిన చార్జీలతో విద్యార్థులకు పోషకాహారం అందించాల్సిన బాధ్యత టీచర్లది, హాస్టల్ సిబ్బందిది అని తెలిపారు.



హాస్టల్ విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ ఛార్జీలు గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లిస్తామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు.

## కేటీఆర్.. అమెరికా వెళ్లి బాత్ రూమ్ లు కడుక్కో

(మొదటి పేజీ తరువాయి)

వద్దు అనలేదు కదా అని ప్రశ్నించారు. కేటీఆర్.. అమెరికా వెళ్లి బాత్ రూంలు కడుక్కోవాలని ఎంపీ రఘునందన్ రావు సెటైర్లు గుప్పించారు. ''మీ నాన్న 10 నెలలుగా ఫామ్‌హౌస్‌లో ఉన్నారు..ఏమైనా నష్టం జరిగిందా'' అని నిలదీశారు. కేటీఆర్ వచ్చింది ప్రజల కోసం కాదని.. ఆయన వచ్చింది డబ్బులు, అధికారం కోసం, ఫామ్‌హౌస్ కోసమని ఎంపీ రఘునందన్ రావు విమర్శలు చేశారు. కేటీఆర్‌కు కాంగ్రెస్ పది నెలల పాలనే విసుగొస్తే.. బీఆర్ఎస్ పాలనను ప్రజలు ఎలా భరించారని నిలదీశారు. కేటీఆర్ మోకాళ్ల యాత్ర చేసిన ప్రజలు విశ్వసించరని విమర్శించారు. కేటీఆర్‌కు తన నాన్న, చెల్లె, బావతో పాటు ఎవరిపై నమ్మకం లేదని ఆరోపించారు. ఫామ్‌హౌస్ కేసులో పాలేవో.. నీళ్లేవో తేలాలంటే సీసీ ఫుటేజ్ బయట పెట్టాల్సిందేనని అన్నారు.

## కులగణనను ప్రజల ముందు ఉంచుతాం

ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న కులగణనపై బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్ కీలక వ్యాఖ్యలు చేశారు. సర్వే తుది నివేదికను దాచకుండా ప్రజల ముందు పెడతామని పేర్కొన్నారు. శుక్రవారం కరీంనగర్ లో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న నిరంజన్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం జరిపిన కుటుంబ సమగ్ర సర్వే వివరాలు ఎవరికీ తెలియకుండా దాచారు. ఆ సర్వేలో ఏముందో భగవంతునికే తెలియాలి. అంతగా దాచాల్సిన అవసరం ఏముందని నిరంజన్ ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇచ్చిన కామారెడ్డి డిక్లరేషన్ బీసీల కులగణనను సీఎం రేవంత్ రెడ్డి అమలు పరుస్తున్నాడని పేర్కొన్నారు. సర్వే పూర్తయ్యాక తుది నివేదికను ప్రజల ముందు పెడతామని, ఏదీ దాచమని తెలియ జేశారు. ఏపీకి చెందిన కొన్ని కులాలను ఇక్కడ బీసీలుగా పరిగణించకూడదు అని విజ్ఞప్తులు వస్తున్నాయని... కొన్ని బీసీ కులాల వారు కూడా తమ పేరు చివరన రెడ్డి, పటేల్ అని పెట్టుకుంటారని, అలా అని వారు ఓసీ వర్గానికి చెందిన వారు కాదని అన్నారు. కులం పేరు తప్పుగా నమోదు చేసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈ సర్వే ద్వారా అన్ని కులాల వారి లెక్కలు, వారి ఆర్థిక స్థితిగతులు తెలుస్తాయని అన్నారు. ఈ సర్వేను ఎవరూ అడ్డుకోవద్దని, అపోహలు సృష్టించవద్దని, రాజకీయాలు చేయవద్దని ప్రతిపక్షాలకు హితవు పలికారు. న్యాయ నిపుణుల సలహా మేరకు ప్రజాఅభిప్రాయ సేకరణ ఈనెల 13 వరకు కొనసాగుతుందని, ప్రజలు తమ అభిప్రాయాలను, విజ్ఞప్తులను తెలపవచ్చునని పేర్కొన్నారు.



# భారత్ రాజీపడబోదు


**భుజ్**: దేశ సరిహద్దుల్లో ఒక్క అంగుళం భూమి విషయంలోనూ భారత్ రాజీపడబోదని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. దేశాన్ని రక్షించే సైనికశక్తిపై ప్రజలు అచంచలమైన విశ్వాసంతో ఉన్నారన్నారు. గుజరాత్‌లోని కచ్ ప్రాంతంలో సైనికులతో కలిసి ప్రధాని దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా త్రివిధ దళాల సైనికులకు మోదీ మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు చెప్పారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధాని మాట్లాడారు. భారత్ తన శత్రువుల మాటలను కాదు.. సైనికుల దృఢ నిశ్చయాన్ని విశ్వసిస్తుందన్నారు. ప్రజలంతా సైనికుల వల్లే దేశం సురక్షితంగా ఉందని భావిస్తున్నారని తెలిపారు. 'ప్రపంచం నిన్ను చూసినప్పుడు.. భారతదేశం బలాన్ని చూస్తుంది. కానీ, శత్రువులు నిన్ను చూసినప్పుడు, వారు తమ దుష్ట పన్నాగాల అంతాన్ని చూస్తారు' అని సైనికులపై ప్రశంసలు కురిపించారు. భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంతో అడుగులు వేస్తున్నామని.. ఈ కలలకు సైనికులే రక్షకులన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడమే తమ ప్రథమ ప్రాధాన్యమని తెలిపారు. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ వేర్వేరుగా ఉన్నా.. త్రివిధ దళాలు ఒక్కచోట చేరితే మన శక్తిసామర్థ్యాలు ఎంతో పెరుగుతాయని చెప్పారు. అంతకుముందు ఇండియన్ నేవీ బోట్‌లో క్రీక్ ప్రాంతంలోని లక్కీ నాలా వద్దకు మోదీ వెళ్లారు. ఈ సందర్భంగా దాయాది దేశం పాకిస్థాన్‌కు ప్రధాని మోవా మాస్ వార్నింగ్ ఇచ్చారు. భారత్-పాకిస్థాన్ దేశాల సరిహద్దులో ఉన్న కచ్ తీరం వైపు పాక్ కన్నెత్తి చూసే సాహసం చేయదని, ఎందుకంటే.. కచ్ తీరంలో సుశిక్షితులైన సైనికులు గస్తీలో ఉన్నారని పాక్‌కు తెలుసని అన్నారు. వ్యూహాత్మకమైన సర్ క్రీక్ ప్రాంతంపై దాడికి గతంలో శత్రు దేశాలు కుట్రలు చేశాయని.. ఇక్కడ ఉన్న సైనికులు ఆ కుట్రలను తిప్పికొట్టారని ప్రధాని గుర్తు చేశారు. 1971 ఇండో పాక్ యుద్ధంలోనూ సర్ క్రీక్ ప్రాంతంలో ఇండియన్ నేవీది కీలక పాత్ర అని కొనియాడారు. ఇక, కచ్ తీరంలో జవాన్లతో దీపావళి వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు.

## సమగ్ర కుటుంబ సర్వేకు ప్రతి ఒక్కరు సహకరించాలి

ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:

రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 6వ తేదీ నుంచి చేపట్టబోయే ఇంటింటికి సమగ్ర సర్వే(సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కులాల సర్వే)కు ప్రజలంతా సహకరించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో రాహుల్ గాంధీ మాట మేరకు ఈ జరుగుతున్న ఈ సర్వేను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని ఈ సర్వే రాబోయే కాలంలో అన్ని రకాల పథకాలను లబ్ధిదారులకు అందించేందుకు ఒక మెగా హెల్త్ చెకప్ మాదిరిగా ఉపయోగపడుతుందన్నారు. ఈ నేపథ్యంలో ఈ సర్వేలో సమాచారం సేకరిస్తున్నవారు, సమాచారం తెలుపుతున్నవారు ప్రతి తెలంగాణ బిడ్డ ఈ సర్వేలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన తెలంగాణ ప్రజలకు బహిరంగ లేఖను రాశారు. నవంబర్ 6వ తేదీ నుంచి 85 వేల మంది ఎన్యూమరేటర్లు ప్రజల వద్ద నుంచి సమాచారం సేకరించనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రతి 10 మంది ఎన్యూమరేటర్లకు ఒక అబ్జర్వర్ గా గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారుల పర్యావేక్షణ ఉంటుందన్నారు. ఇంటింటి నుంచి సమగ్ర సమాచారం సేకరించి ఆ డేటాను ఎంట్రీ చేయడంతో పాటు నవంబర్ 30 లోపు ఈ సమాచార సేకరణ పూర్తి చేయాలనే ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. కులగణన కోసం ప్రభుత్వం ఇప్పటికే జీవో నెం 199 ద్వారా నిరంజన్ ఛైర్మన్ గా రాపోలు జయ ప్రకాశ్, తిరుమల గిరి సురేందర్, బాల లక్ష్మి మెంబర్లుగా బీసీ కమిషన్ ను నియమించిందని, రాష్ట్ర ప్లానింగ్ డిపార్ట్మెంట్ ను నోడల్ డిపార్ట్ మెంట్ గా ప్రకటిస్తూ ప్రభుత్వం గతంలోనే ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు.

## జార్ఖండ్ లో కాంగ్రెస్ దే విజయం



జార్ఖండ్: జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయమని పార్టీ స్టార్ క్యాంపెయినర్, తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. రాంచీలోని జేకే హాల్‌లో సంవాద్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికలలో ప్రచార వ్యూహాలు, ఎన్నికల హామీలు, కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య సమన్వయం వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ జార్ఖండ్ పురోగతి కోసం వ్యూహరచన చేస్తుందని చెప్పారు. కూటమి ఎన్నికలు హామీలు, కార్యక్రమాల గురించి చర్చించడంతో పాటు చేపట్టాల్సిన కార్యక్రమాలను నిర్ధేశించుకున్నామని ఆయన తెలిపారు. కార్యకర్తలంతా సమన్వయంగా పనిచేస్తే మనం జార్ఖండ్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. దేశాన్ని రక్షించడం కోసం, రాజ్యాంగ మౌలిక సూత్రాలను కాపాడడంతో పాటు దేశ వనరులను కాపాడుకోవాలంటే ఇండియా కూటమికి ఓటు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరముందన్నారు.



# శివసేన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల పంపిణీ



**ప్రజాభూమి ప్రతినిధి, బెజ్జంకి:**

బెజ్జంకి మండల కేంద్రంలో రావుల కనుకయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించిగా వారి కుటుంబాన్ని శివసేన యూత్ అసోసియేషన్ వారు పరామర్శించారు.అనంతరం యూత్ సభ్యులు బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు అందచేశారు.ఈ కార్యక్రమం లో యూత్ అధ్యక్షులు ఎలిగే సతీష్,కార్యదర్శి కౌడగని తిరుపతి,ఉపాధ్యక్షులు గుబిరే అనిల్,గుబిరే హరి ప్రకాష్,దొంతరవేని మహేష్,రొడ్డ చరణ్,రావుల నరేష్,లడే నరేష్,బోనగిరి బాబు తదితరులు కలరు.

# బాలికపై లైంగిక దాడి

## ఐదుగురిపై పోక్సో కేసు

**ప్రజాభూమి ప్రతినిది, పరిగి, దోమ:**

ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఇద్దరు మేజర్లు, వారికి సహకరించిన ముగ్గురు బాలురపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా దోమ మండలంలో చోటు చేసుకుంది. డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి తెలిపిన ప్రకారం..దోమ మండలంలోని ఓ గ్రామంలో గత నెల 28న పుస్తకాలు ఇస్తామని నమ్మించి అదే గ్రామానికి చెందిన ఇద్దరు బాలురు బాలికను ఓ ఇంటికి తీసుకువెళ్లారు. అప్పటికే అక్కడ మరో ముగ్గురు వేచి ఉన్నారు. వారిలో ఒకరు మైనరు కాగా మరో ఇద్దరు మేజర్లు. ఇంట్లోకి వెళ్లిన అనంతరం ఇద్దరు మేజర్లు, మరో బాలుడు బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డారు. మిగతా వారు వారికి సహకరించినట్లు చెప్పారు. పొలం పనుల నుంచి వచ్చిన తల్లిదండ్రులు కూతురు ఇంట్లో లేకపోయే సరికి స్నేహితుల ఇంటికి వెళ్లి ఉండవచ్చని భావించారు. ఆలస్యంగా రావడంతో ప్రశ్నించగా జరిగిన విషయం చెప్పడంతో తల్లిదండ్రులు గత నెల 29న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఐదుగురిపై పోక్సో కేసు నమోదు చేశారు. నిందితుల్లో ఇద్దరు మేజర్లను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు, మిగతా ముగ్గురు బాలురను జువైనెల్ హోంకు తరలించారు. బాధితురాలిని సఖి సెంటర్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.



# కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీ లు ఒకటే

## బండి సంజయ్ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి

**ప్రజాభూమి ప్రతినిది, బెజ్జంకి:**



ఈ రోజు బెజ్జంకి మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు ఒకటే అని,ఇద్దరూ చేయాల్సింది పాదయాత్ర కాదు,మోకాళ్ల యాత్ర చేయండని,6 గ్యారంటీలపై రేవంత్ రెడ్డి కి పాదయాత్ర చేసే దమ్ముందా?గత 10 ఏళ్ల పాలనలో బీఆర్ఎస్ చేసిన తప్పులను ఒప్పుకునే దమ్ముందా?అని ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీపై కాంగ్రెస్ యుద్ధం దేనికో సమో చెప్పాలని,పేదల అభ్యున్నతికి రాత్రింబవళ్లు కష్టపడుతున్నందుకా అని,కాంగ్రెస్ వన్నీ ఉత్తర కుమార ప్రగల్భాలే అని,దీపావళి దాటినా రాజకీయ బాంబులు ఇంతవరకు పేల్చలేదని,కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు ఒక్కటే అని,హిందువులపై ట్రంప్ కు ఉన్న శ్రద్ధ కాంగ్రెస్ కు లేదని,హిందువులపై దాడులు జరుగుతుంటే ఏ ఒక్కరు నోరు మెదపట్లేదని,హిందువుల ఓట్లు మీకు అక్కర్లేదని చెప్పే దమ్ముందా అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ హాట్ కామెంట్స్ చేశారు. కాంగ్రెస్ పార్టీకి చేతనైతే 6 గ్యారంటీలపై పాదయాత్ర చేయాలని సవాల్ విసిరారు.శుక్రవారం రోజున మానకొండూరు నియోజకవర్గంలోని ఇల్లంతకుంట,బెజ్జంకి మండలాల్లో పర్యటించిన బండి సంజయ్ కుమార్ బెజ్జంకి పట్టణ బీజేపీ అధ్యక్షులు సంగ రవి నివాసానికి విచ్చేసి,జిల్లా అధ్యక్షులు గంగాడి మోహన్ రెడ్డి,బీజేపీ మండల అధ్యక్షులు కొలిపాక రాజు,స్థానిక నేతలతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు.ఎన్నికలకు ముందే రాజకీయాలు అని ఆ తరువాత అభివృద్ధి,ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నాని,గత 10 ఏళ్లలో ప్రజలను ఏ విధంగా మోసం చేశామో,అవినీతికి పాల్పడ్డామో బీఆర్ఎస్ నేతలు చెప్పుకోండని.6 గ్యారంటీలపై ప్రజలను చేసి గద్దెనెక్కినంక వాటిని అమలు చేయకుండా మోసం చేస్తున్న విషయాన్ని కాంగ్రెస్ నేతలు చెప్పుకోవాలని, మీరు చేయాల్సింది పాదయాత్ర కాదని రెండు పార్టీల నేతలు మోకాళ్ల యాత్ర చేయాలని,ప్రధాన ప్రతిపక్ష నేతగా ఉన్న కేసీఆర్ గత 6 నెలలుగా ఫాంహౌజ్ కే పరిమితమయ్యడాని,కాంగ్రెస్ పార్టీ రైతు భరోసా ఇవ్వకుండా గోస పెడుతున్నరని,మహిళలకు తులం బంగారం,స్కూటీ,నెలనెలా రూ.2500లు ఇస్తానని మోసం చేసి,6 గ్యారంటీల పేరుతో ఓట్లేయించుకుని నిలువునా మోసం చేయటమే కాకుండా 2 లక్షల ఉద్యోగాలిస్తామని,ఫీజు రీయంబర్స్ మెంట్ ఇవ్వకుండా కాలేజీలు మూసివేసే పరిస్థితి ఉన్నా పట్టించుకోవడం లేదని,ఆచరణ సాధ్యంకాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ,గద్దెనెక్కినంక చేతులెత్తేసారని,దీపావళికి ముందే రాజకీయ బాంబులు పేలుతాయని చెప్పారని, అయిన ఏం కాలేదని,,కాంగ్రెస్,బీఆర్ఎస్ రెండు పార్టీలూ ఒక్కటే అని,అరెస్టులు కాదు కదా, కనీసం నోటీసులు కూడా ఇవ్వలేకపోయారని,6 గ్యారంటీలను అమలు చేయకుండా,మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించి రాహుల్ గాంధీని ప్రధాని చేసేందుకు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ నుండే యుద్ధం ప్రారంభించిందని అనటం వారి అవివేకానికి నిదర్శనం అని,రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడం కల్ల అని,ప్రజలకిచ్చిన 6 గ్యారంటీలను అమలు చేసి చూపాలని అన్నారు.బీజేపీ గుండారం నాయకులు సాన వేణు ఆధ్వర్యంలో బెజ్జంకి నుండి గుండారం మీదుగా కిష్టపూర్ వరకుడబుల్ రోడ్ నిర్మాణం చేయాలని వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డి,బీజేపీ రాష్ట్రనాయకులు సొల్లు అజయ్ వర్మ,బోయినపల్లి అనిల్ రావు,మండల ఉపాధ్యక్షులు గైని రాజు,ఓబీసీ మోర్చా అధ్యక్షులు సాన వేణు,బీజేవైఎం మండల అధ్యక్షులు తూము రమేష్ యాదవ్,ప్రధాన కార్యదర్శి బొప్పెన అజయ్,మహిళ అధ్యక్షులు బామాండ్ల జ్యోతి,ఉపాధ్యక్షులు బండిపెల్లి సునీత,ప్రధాన కార్యదర్శి లింగాల లావణ్య,నాయకులు వడ్లూరి సాయులు,కొత్తపేట రామచంద్రం,శీలం వెంకటేష్, బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

# బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ ని కలిసిన గౌడ సంఘం నాయకులు

**ప్రజాభూమి ప్రతినిది, బెజ్జంకి:**



కరీంనగర్ కలెక్టరేట్ లో బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ ను కలిసిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు తాళ్ళపల్లి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా గౌడ సంఘం నాయకులు బెజ్జంకి మండల అధ్యక్షులు చెప్యాల శ్రీనివాస్ గౌడ్ లు కలిసి తమ విజ్ఞప్తులను తెలిపారు.ఈ కార్యక్రమంలో సమగ్ర కుల గణన పై అభిప్రాయ సేకరణ లో భాగంగా బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ ని కలిసి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ పెంపు మరియు గౌడ కులస్థుల హక్కుల పై వినతి పత్రం సమర్పించారు.కల్లుగీతా కార్పొరేషన్ ను వెంటనే ప్రకటించాలని,తాటి ఈత చెట్ల పెంపకం,మద్యం టెండర్లలో గౌడ కులస్తులకు గత ప్రభుత్వం చేసిన 10 శాతం ఉన్న రిజర్వేషన్ లు,50 సంవత్సరాలు దాటిన గీతా కార్మికులకు పెన్షన్లు అందించాలని,గౌడ నిరుద్యోగ యువతకు బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేయగా,బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ సానుకూలంగా స్పందించి,మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ తో కలిసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు తాల్లపెల్లి హరికుమార్ గౌడ్,జిల్లా గౌడ సంఘం జిల్లా కోశాధికారి పొన్నం శ్రీనివాస్ గౌడ్,జిల్లా ప్రధాన కార్యదర్శి మాచెర్ల అంజన్న గౌడ్,తాల్లపల్లి సంపత్ గౌడ్,పట్టణ అధ్యక్షులు దూలం అంజన్న గౌడ్,మాజీ సర్పంచ్ బొమ్మ ఈశ్వర్ గౌడ్,చెప్యాల శ్రీనివాస్ గౌడ్ రాష్ట్ర నాయకులు గణగోని సత్తయ్య గౌడ్,మండల అధ్యక్షులు మహేందర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, తాళ్ళపల్లి మహేష్ గౌడ్, మంద రమేష్ గౌడ్, మార్క రాజు గౌడ్ జిల్లా గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.



# వాలీబాల్ టోర్నమెంట్ బహుమతులు ప్రదానం చేసిన బిఆర్ ఎస్ నాయకులు

**ప్రజాభూమి ప్రతినిది,**

గత నాలుగు రోజులనుండి బి, ఆర్, ఎస్,పార్టీ రాష్ట్రం నాయకులు డాక్టర్ ఆర్,ఎస్,ప్రవీణ్ కుమార్ సర్ గారి ద్వర్యంలో జరిగినటువంటి వాలీబాల్ టోర్నమెంట్లో యువత చేడువశనలకు అలవాటు పడకుండా క్రీడల్లో పాల్గొని శారీరకంగా మానసికంగా మంచి ఆలోచనలతో ఉన్నతమైన స్థానాల్లో ఉండాలని శ్యామ్ రావ్ అన్నారు, వాలీబాల్ పోటీల్లో నేడు మొదటి బహుమతి ఎస్,న్,వై, ద్వితీయ బహుమతి గుంట్లపేట మరియు తృతీయ బహుమతి చెద్వయి క్రీడాకారులు బహుమతులు అందుకోవడం జరిగింది. ఇందులో భాగంగా పెంచికల్ పేట్ ఎస్,ఐ కొంరయ్య బి, ఆర్, ఎస్,పార్టీ నాయకులు లెండుగురే శ్యామ్ రావు గారు, మొహిన్ భాయ్, నక్క మనోహర్, సలీం,అవుల రాజుకుమార్, దాసరి నరేందర్, మండల నాయకులు బిట్టి శ్రీనివాస్, రామిల్ల దేవాజీ,బండి మహేష్, ముత్తినేని తిరుపతి, మరియు కార్యకర్తలు పాల్గొని క్రీడాకారులకు బహుమతులు అందజేయడం జరిగింది.



# సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు

**రాజన్నసిరిసిల్ల జిల్లా:**

వేములవాడ రూరల్ మండలం లింగంపల్లి,బొల్లారం,హన్మాజీపేట గ్రామాల్లో సొసైటీ(PACS) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్యాక్స్ చైర్మన్& కెడీసీసీ బ్యాంకు డైరెక్టర్ ఏనుగు తిరుపతి రెడ్డి ప్రారంభించారు. వైస్ చైర్మన్ లక్ష్మీ కాంతారావు,ప్యాక్స్ డైరెక్టర్లు సంజీవ రెడ్డి, సురేందర్ రెడ్డి, సెస్ డైరెక్టర్ ఆకుల దేవరాజం,మాజీ సర్పంచులు,సీఈవో లక్ష్మణ్, స్థానిక ప్రజా ప్రతినిధులు,అధికారులు,రైతులు, పాల్గొన్నారు.







# విద్యార్థులతో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజాభూమి ప్రతినిధి, తిమ్మాపూర్:**

కరీంనగర్ పట్టణంలోని శర్మ నగర్ బీసి గురుకుల పాఠశాలలో రవాణా మరియూ బీసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు. ప్రభుత్వం డైట్ మరియూ కాస్మొటిక్ చార్జీలు పెంచిన సందర్భంగా విద్యార్థులతో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ అనంతరం సమావేశంలో మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా ఓపెన్ మార్కెట్ లో అధికంగా ధరలు పెరిగినప్పటికీ విద్యార్థుల మెస్ చార్జీలు పెరగలేదు బిసి సంక్షేమ శాఖ మంత్రిగా నేను విద్యార్థి నాయకుడిగా పిల్లల మెస్ చార్జీలు, కాస్మొటిక్ చార్జీలు పెంచాలని ముఖ్యమంత్రి ,ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోవడం జరిగింది పెరుగుతున్న ధరలకు అనుగుణంగా భారీగా ధరలు పెంచడం జరిగింది విద్యార్థి నాయకుడిగా ఉన్నపుడు ధర్నాలు చేసి ప్రభుత్వం మీద ఒత్తిడి పెంచి ధరలు పెంచుకునేవాళ్ళం, అధికారంలోకి వచ్చినతరువాత మెస్ చర్జీలకు పెంపు తో పాటు ఆ బిల్లులు నాణ్యత గల వస్తువులు సరఫరా చేయడానికి బిల్లులు గ్రీన్ ఛానెల్ ద్వారా చేయాలని ముఖ్యమంత్రి గారు నిర్ణయం తీసుకున్నారు, దశాబ్దకాలంగా మోడల్ స్కూల్ బదిలీలు లేకుండే వారి బదిలీలు చేపట్టాము, జాతీయ రాష్ట్ర స్థాయిలో ఆటల్లో రాణించేలా విద్యార్థులను స్పోర్ట్స్ టీచర్ తీర్చిదిద్దాలి,త్వరలోనే ఇంటిగ్రేటెడ్ బిల్డింగ్స్ స్పోర్ట్స్ మైదానాలు వసున్నాయి,బిసి సంక్షేమ శాఖ మంత్రి గా మీకు విజ్ఞప్తి చేస్తున్నాను ఎమ్ ఎల్ ఎ లు ప్రతి నియోజక వర్గాలలో నీ హాస్టల్ లో విజిట్ చేసి వారి సమస్యలను పరిష్కరించాలని అన్నారు,1020 భవనాల్లో 320 మాత్రమే ప్రభుత్వ భావనలు మిగిలినవి అద్దెకు నడుస్తున్నాయి అని తెలిపారు ఈ కార్యక్రమం లో గ్రంథాలయ కమిటీ చైర్మన్ సత్తు మల్లేష్,ఆర్ సీ ఓ అంజలి,ప్రిన్సిపాల్ కట్ట వేణుగోపాల్,గురుకుల సిబ్బంది, మరియూ కరీంనగర్ పట్టణ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





# పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు

**ప్రజాభూమి ప్రతినిది, బెజ్జంకి:**

బెజ్జంకి మండలం గాగిల్లాపూర్ గ్రామంలో పెద్దమ్మ ఆలయంలో ఎస్డీఎఫ్ నిధులతో తో ఐదు లక్షల రూపాయలతో సీసీ పనులను ప్రారంభించిన పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్,మండల అధ్యక్షులు ముక్కిస రత్నాకర్ రెడ్డి,ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ,ముదిరాజ్ మండల అధ్యక్షులు అక్కరవేణి పోచయ్య ముదిరాజ్ లు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి,ఎర్రల రాజు,గ్రామ శాఖ అధ్యక్షులు పైడిపల్లి శంకర్, మాజీ సర్పంచ్ పులి శ్రీనివాస్,గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు బొమ్మరవేణి మల్లయ్య, బొమ్మరవేణి సంతోష్,బొమ్మరవేణి భూమయ్య,బైర సంతోష్, బండి పెల్లి శ్రీనివాస్, ముదిరాజ్ నాయకులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

**ప్రజాభూమి ప్రతినిధి, రామాయంపేట:**

మెదక్ జిల్లా రామాయంపేట మండలం కాట్రియలగ్రామం అనారోగ్యంతో మృతి చెందిన కుమ్మరి పెంటవ మరణించిన విషయం తెలుసుకున్న మెదక్ నియోజకవర్గ బీఆర్ఎస్ తిరుపతిరెడ్డి రూ. 5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో తాజా మాజీ మైలారం శ్యామ్, మాజీ ఉపసర్పంచ్ స్రవంతి రాజేందర్ గుప్తా, బిల్లం శ్యామ్‌రెడ్డి, శ్రీశైలంరెడ్డి, భిక్షపతి, సాయిరెడ్డి వారికి అందజేసి, వారి కుటుంబానికి అండ ఉంటానని హామీనిచ్చారు.

## రైస్ మిల్లులో షార్ట్ సర్క్యూట్ గన్ని బ్యాగులు దగ్ధం



**ప్రజాభూమి ప్రతినిధి, నార్సింగి :**

రైస్ మిల్లులో షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగి గన్నీ సంచులు దగ్ధమైన సంఘటన మండల కేంద్రంలోని తిరుమల రైస్ మిల్లులో చోటుచేసుకుంది. గురువారం రాత్రి దీపావళి పండుగ సందర్భంగా లక్ష్మీ పూజలు చేసి తిరుమల రైస్‌మిల్ యజమాని ఎర్రం శ్రవణ్‌కుమార్ ఇంటికి వెళ్లిపోయారు. శుక్రవారం ఉదయం 7గంటలకు ఒక్కసారిగా రైస్‌మిల్ ఆవరణలో మంటలు చెలరేగి భారీ సంఖ్యలో నిల్వ ఉంచిన గన్ని బ్యాగులు పూర్తిగా తగల బడిపోయాయి. రైస్ మిల్లులో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు అంటుకున్నట్లుగా తెలుస్తుంది. దీంతో వేల సంఖ్యలో గన్ని బ్యాగులు తగలబడి, మంటలు వ్యాపించి పూర్తిగా పొగలు అలుముకున్నాయి. రామాయంపేట అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పినప్పటికీ పూర్తిస్థాయిలో గన్ని బ్యాగులు తగలబడి పోవడంతో సుమారు రూ. 9 నుంచి 12 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని యజమాని

## డ్వాక్రా గ్రూపు మహిళలకు కోడి పిల్లల పంపిణీ



**ప్రజాభూమి ప్రతినిధి, నార్సింగి :**

మహిళా శక్తిలో భాగంగా శుక్రవారం ఐకేపీ కార్యాలయం వద్ద డీపీఎం స్పెషల్ ఆఫీసర్ ప్రకాష్ ఆధ్వర్యంలో డీఆర్డీవో శ్రీనివాస్‌రావు 2400 కోడి పిల్లలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు, ఐకేపీ ఏపీఎం అశోక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ఇందిరా మహిళ శక్తి పథకంలో భాగంగా శుక్రవారం నార్సింగి మండల కేంద్రంలో 2,400 ఊరు కోడి పిల్లలను డ్వాక్రా గ్రూపు మహిళలకు పంపిణీ చేశామన్నారు. కోళ్ళ పెంపకం మహిళలకు ఆర్థిక చేయూత లభిస్తుందని, ఇంటి వద్ద స్వయం ఉపాధి ద్వారా మహిళలు ఆర్థిక ప్రయోజనం పొందేలా పెరటి కోళ్ల పెంపకాన్ని ప్రోత్సాహించిందని అన్నారు. బహిరంగ మార్కెట్లో కోళ్ల పెంపకానికి కోడి మాంసానికి ఎంతో డిమాండ్ ఉందనీ, ఫామ్ కోళ్ల కన్నా నాటు కోళ్లు లేదా పెరటి కోళ్లు ఎక్కువ డిమాండ్‌తో పాటు ఎక్కువ ధర కూడా ఉండటంతో మహిళలకు ఈ పథకం ద్వారా ఇంటి నుంచి ప్రతినెల వేల రూపాయలు సంపాదించే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీలు శంకర్, సుల్తానా, వీవోఏలు, డ్వాక్రా గ్రూపు మహిళలు, సిబ్బంది పాల్గొన్నారు.

# సమగ్ర ఇంటింటి సర్వేపై అవగాహన

- సర్వే వివరాలు సమగ్రంగా నమోదు చేయాలి
- ఇంటింటి సర్వే పకడ్బందీగా చేపట్టాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్



**ప్రజాభూమి ప్రతినిధి, మెదక్:**

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నంబరు 6 నుంచి 18 వరకు నిర్వహించనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పై అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. శుక్రవారం మెదక్ కలెక్టరేట్‌లో నుంచి సంబంధిత ఆర్డీవోలు, తహశీల్దార్‌లు, ఎంపీడీవోలకు కలెక్టర్ సామాజిక, ఆర్థిక, సర్వే మార్గదర్శకాలపై మండలాల ప్రత్యేక టెలి కాన్ఫరెన్స్ ద్వారా తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఎన్యుమరేషన్ బ్లాకులు సూపర్‌వైజర్స్ కరెక్ట్‌గా నియమించుకోవాలని, 10శాతం రిజర్వ్ స్టాఫ్ అందుబాటులో ఉంచుకోవాలని ఎన్యూమరేషన్ బ్లాకులో ప్రతి కుటుంబాన్ని క్రమ పద్ధతిలో జాబితా తయారు చేయాల్సి ఉంటుందన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో 1.68 లక్షల కుటుంబాలున్నాయని, 1600 మంది ఎన్యూమరేటర్లతో సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. సర్వే ప్రక్రియలో సూపర్వైజర్స్ పది శాతం రాండంగా డేటా ఖచ్చితంగా తనిఖీ చేయాలని తెలిపారు. మున్సిపాలిటీలో ఉన్న వార్డుల్లో ఏ ఒక్క ఇంటిని కూడా విడిచి పెట్టారాదన్నారు. అనంతరం మండల అభివృద్ధి అధికారులతో టెలికాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ మాట్లాడారు రాష్ట్రంలోని షెడ్యూల్ కులాలు షెడ్యూల్డ్ తెగలు వెనుకబడిన తరగతులు, ఇతర బలహీన వర్గాల అభివృద్ధి కొరకై వివిధ సామాజిక ఆర్థిక విద్య ఉపాధి, రాజకీయ అవకాశాలను మెరుగుపరచడానికి తగిన ప్రణాళికలు తయారు చేయడం కోసం ఈ సర్వే ప్రభుత్వం చేపడుతున్నట్లు క్షేత్ర స్థాయిలో సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని మండల అభివృద్ధి అధికారి ఆదేశించారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ నగేష్, మెదక్ ఆర్డీవో రమాదేవి, తూప్రాన్ ఆర్డీవో జయ చంద్రారెడ్డి, నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ రెడ్డి, సంబంధిత తహశీల్దార్‌లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రాలు తెరిచారు.. కొనుగోలు మరిచారు

- 15 రోజులు గడిచిన కొనుగోలు ప్రారంభించలేరు.
- వానకు తడుస్తూ ఎండకు ఎండుతున్న ధాన్యం
- తక్కువ ధరకే దళారులకు ధాన్యం అమ్ముకుంటున్న రైతులు
- బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి భూపతి రాజు



**ప్రజాభూమి ప్రతినిధి, నార్సింగి :**


కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆర్భాటం ఎక్కువ కార్యాచరణ తక్కువ అని బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి భూపతి రాజు ఎద్దేవా చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం భూపతి రాజు విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని హంగు ఆర్భాటాలతో వరి కోతలకు ముందే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని గత ప్రభుత్వంలో ఇలా ఎప్పుడూ జరగలేదని తమదే అసలైన రైతు ప్రభుత్వం అని ప్రగల్భాలు పలుకుతూ హడావిడిగా ఐకేపీ, సొసైటీల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 15 రోజులు గడుస్తున్న ధాన్యం కొనుగోలు చేయడం మాత్రం మరించిందని మండిపడ్డారు. అందులోనూ మండల వ్యాప్తంగా ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు కావల్సిన ఆరు కొనుగోలు కేంద్రాలకు నాలుగు ప్రారంభించి శంకాపూర్, జప్తి శివునూర్ లో ప్రారంభించలేదన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ఆరబెట్టిన వారి ధాన్యం కళ్లాలకే పరిమితమైందని, పలుచోట్ల చేసేదేమీ లేక రైతులు దళారులను ఆశ్రయించి తక్కువ ధరకే ధాన్యాన్ని విక్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా కొనుగోలు కేంద్రాల వద్ద ఎందుకు ధాన్యం కొనుగోలు ప్రారంభించడం లేదని ఐకేపి అధికారులను, సొసైటీ చైర్మన్‌లను అడగగా రైస్ మిల్లులకు అలాట్మెంట్ రానందున వల్ల ధాన్యం కొనుగోలు ప్రారంభించడం లేదని వారు చెబుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఏదో మేలు చేస్తుంది అన్న అసత్యపు పేరుకు మాత్రమే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారని, రైస్ మిల్లులు అలాట్మెంట్ చేయకుండా కొనుగోలు కేంద్రాలు ఎందుకు ప్రారంభించారని ప్రశ్నించారు. అకాల వర్షాలకు ఇప్పటికే పలుమార్లు ధాన్యం తడిసిందని, రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వారికి జరుగుతున్న నష్టాలకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని అన్నారు. రైతుల నుంచి ధాన్యం సేకరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని భూపతి రాజు విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు మేల్కొని వెంటనే కొనుగోలు ప్రక్రియ ప్రారంభించాలని, తడిసిన ధాన్యం సైతం పూర్తిగా కొనుగోలు చేయాలని భూపతి

## ఘనంగా దీపావళి వేడుకలు



**ప్రజాభూమి ప్రతినిధి, చిన్న శంకరంపేట:**

మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో దీపావళి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం 6 గంటలకు హారతులు తీసుకొని బాణసంచా కాలుస్తూ దీపావళి వేడుకల్లో మునిగి తేలారు. సాయంత్రం వ్యాపారస్తులు తమ వ్యాపార సముదాయాల వద్ద లక్ష్మీదేవి పూజలు ఘనంగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. తమ దుకాణాల్లో లక్ష్మి అమ్మవారి పూజలు నిర్వహించారు. అనంతరం తమ వ్యాపార సంస్థల ముందు పెద్ద ఎత్తున బాణాసంచాకాల్చారు. ఈ పండగ బాణాసంచా రంగురంగుల బట్టలు స్వీట్లు, విందులు, బహుమతులతో కుటుంబాలు, స్నేహితుల మధ్య ఉత్సాహభరితమైన వేడుకను జరుపుకుంటారు. దీపావళి రోజు దుకాణాల వద్ద లక్ష్మీ పూజలు నిర్వహిస్తే తమ వ్యాపారాలు బాగుంటాయని, అమ్మవారి కృపాకటాక్షాలతో, అదృష్టం శ్రేయస్సును ప్రసాదిస్తుందని భావిస్తారు.





## అకాల వర్షం.. తడిసిన ధాన్యం

**బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు నాగరాజు**

**ప్రజాభూమి ప్రతినిధి, చిన్న శంకరంపేట:**

చిన్న శంకరం పేట మండలంలోని పలు గ్రామాల్లో ఆర్భాటంగా సొసైటీ, ఐకెపి ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన నేటి వరకు కొనుగోలు జరుగలేదు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి ఆరబెట్టిన ధాన్యం కల్లాలకే పరిమితమైంది. గురువారం కురిసిన అకాల వర్షానికి వరి ధాన్యం తడిసి ముద్దయింది పలుచోట్ల వర్షానికి రోడ్ల మీద, కల్లాలలో నేల పాలయ్యింది. బీఆర్ఎస్ పార్టీ యువత విభాగం అధ్యక్షుడు అత్తెల్లి నాగరాజు మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.



## లక్ష్మాపూర్‌లో మైనంపల్లి జన్మదిన వేడుకలు

**ప్రజాభూమి ప్రతినిధి, రామాయంపేట:**

మెదక్ జిల్లా రామాయంపేట మండలం లక్ష్మాపూర్ గేటు వద్ద మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కమ్మరి రమేష్ చారి ఆధ్వర్యంలో కాట్రియాల, లక్ష్మాపూర్, దంతేపల్లి, పర్వతాపూర్, జమ్లా తండా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, మైనంపల్లి సోషల్ సర్వీస్ సభ్యులు, మైనంపల్లి అభిమానులు పెద్ద ఎత్తున సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కమ్మరి రమేష్ చారి మాట్లాడుతూ అతి చిన్న వయసులోనే ఎమ్మెల్యేగా ఎన్నికైన రోహిత్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. త్వరలో మంత్రివర్గంలో చోటు కల్పించి ఎమ్మెల్యే ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు కలకాలం జీవించాలని ఆ భగవంతున్ని కోరుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమ్మరి రమేష్, శ్రావణ్ కుమార్, సాయి, బన్సీలాల్ నాయక్, సంతోష్, శ్యామ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మైనంపల్లి రోహిత్ జన్మదిన వేడుకలు



**ప్రజాభూమి ప్రతినిధి, మెదక్:**

మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ జన్మదినం కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మెదక్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం మెదక్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం రామాలయం దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వెల్కంబోర్డు దగ్గరలోని దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మెదక్ మాతా శిశు ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీతో పాటు అన్నదాన కార్యక్రమాని నిర్వహించారు. మెదక్ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ఎమ్మెల్యే ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. అనునిత్యం నియోజక ప్రజల అభ్యున్నతి ధ్యేయంగా ఎమ్మెల్యే కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఆంజనేయులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు జీవన్‌రావ్, పవన్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అశోక్, కౌన్సిలర్‌లు లక్ష్మిముత్యంగౌడ్, లింగం, శేఖర్, సమి, నిఖిల్, సాయి, విజయలక్ష్మి, జ్యోతికృష్ణ, హరిత, సులోచన, స్వరూప, సుభాష్ చంద్రబోస్, మన్సుర్ అలీ, ఉమర్, వేణు, శ్రీను, నరేష్, బాని, రమేష్, లింగోజి, ప్రవీణ్, భూపతి రాజు, సత్యం, అరవింద్‌గౌడ్, శంకర్‌గౌడ్, ప్రభాకర్, భూపతి, మహిపాల్, కిషన్, శ్రీనివాస్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే రోహిత్ జన్మదిన వేడుకలు



**ప్రజాభూమి ప్రతినిధి, చిన్నశంకరంపేట:**

మెదక్ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తూ, పేదలకు అండగా ఉంటూ గత 20 సంవత్సరాలుగా సేవలందిస్తున్న డాక్టర్ మైనంపల్లి రోహిత్ రాబోయే రోజుల్లో మంచి ఉన్నత స్థాయికి ఎదగాలని ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని, మరింత ఉన్నత పదవి అధిరోహించాలని చిన్న శంకరంపేట మాజీ సర్పంచ్ రాజిరెడ్డి అన్నారు. చిన్న శంకరంపేట మండలం కొరివిపల్లి గ్రామంలో మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ పుట్టిన రోజు సందర్భంగా ఎమ్మెల్యే స్వగ్రామమైన కొరివిపల్లి గ్రామంలోని దుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయంలో ఏర్పాటు చేసిన యజ్ఞ హోమాల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ దంపతులు పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న శంకరంపేట మాజీ సర్పంచ్ రాజిరెడ్డి మాట్లాడుతూ మెదక్ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తూ పేద ప్రజలకు అండగా ఉంటున్న మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని అమ్మవారి కృపా కటాక్షాలతో అష్టఐశ్వర్యాలు ఆయురారోగ్యాలు అమ్మవారు ప్రసాదించాలని మెదక్ నియోజకవర్గం అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ ముందు ముందు మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని కోరుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, అరుణప్రభాకర్, సిద్ధిరాములు, నరేందర్, అమర్‌సేనారెడ్డి, శివకుమార్, రమేష్‌రెడ్డి, యాదవరావు, పుల్లారావు, సుప్రభా

# కుటుంబ సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

## జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్





**ప్రజాభూమి ప్రతినిధి, వికారాబాద్:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ తెలిపారు. శుక్రవారం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను వికారాబాద్ మండలం మదనపల్లిలో అదనపు కలెక్టర్ సుధీర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎన్యుమరేటర్లను ఉద్దేశించి అదనపు కలెక్టర్ సుధీర్ మాట్లాడుతూ గ్రామాల్లో సర్వే నిమిత్తం వెళ్లినప్పుడు ఇంటి యజమానిని పూర్తి వివరాలను అడిగి తెలుసుకోవాలన్నారు. యజమాని ఇచ్చిన వివరాలను మాత్రమే ప్రొఫార్మాలో పొందుపరచాలని ఆయన సూచించారు. ఎలాంటి తప్పులు లేకుండా ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకొని ఇచ్చిన ఫారాల్లో సమాచారాన్ని క్రోడీకరించాలని ఆయన సూచించారు. అదనపు కలెక్టర్‌తో పాటు ఎంపీడీవో వినయ్ కుమార్, సర్వే అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మంత్రి, ఎమ్మెల్సీలకు ఘన స్వాగతం

**ప్రజాభూమి ప్రతినిధి, మేడ్చల్ :**

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమల ప్రారంభానికి విచ్చేసిన మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డిలకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాపోలు రాములు, ఆయన సతీమణి బోడుప్పల్ మాజీ వార్డ్ మెంబర్, సందీప్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రాపోలు సువర్ణ తదితరులు పుష్ప గుచ్చం అందజేసి ఘన స్వాగతం పలికారు.



# నాగారంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే

**ప్రజాభూమి ప్రతినిధి, కీసర:**

నాగారం మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వే(సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) ఎన్యుమరేటర్లు డోర్ టు డోర్ చేస్తున్న సర్వేను స్పెషల్ ఆఫీసర్ చంద్రకళ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, డిప్యూటీ స్టాటిస్టిక్స్ ఆఫీసర్ అశోక్ మున్సిపాలిటీ కమిషనర్.ఎస్. భాస్కర్ రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ పరిశీలనలో స్పెషల్ ఆఫీసర్ చంద్రకళ ఎన్యుమరేటర్లలతో మాట్లాడి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ చంద్రశేఖర్, ఎన్యుమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా సదర్ సమ్మేళనం





**ప్రజాభూమి ప్రతినిధి, శామీర్‌పేట :**

తూంకుంట మున్సిపాలిటీలో కౌన్సిలర్ బొల్లబోయిన రాజకుమార్ యాదవ్ ఆధ్వర్యంలో సదర్ సమ్మేళన వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం దీపావళి సందర్భంగా యాదవులు గ్రామంలో సదర్ వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. యాదవులు తమ పాడిపశువులకు, దున్నపోతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఎంపీపీల ఫోరం అధ్యక్షుడు, శామీర్‌పేట మాజీ ఎంపీపీ బొల్లాబోయిన చంద్రశేఖర్ యాదవ్ హాజరై పూజలు నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన సదర్ వేడుకల్లో భాగంగా యాదవులు దున్నపోతులను అందంగా ముస్తాబు చేసి గ్రామంలోని మల్లన్న ఆలయంలో పూజల అనంతరం వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన దున్నపోతుల విన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వీరేష్ యాదవ్, ప్రశాంత్ యాదవ్, ప్రద్యున్ యాదవ్, యాదవ సంఘం నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


# వికారాబాద్ మణప్పురం గోల్డ్ లోన్ దొంగ అరెస్ట్



**ప్రజాభూమి ప్రతినిధి, వికారాబాద్:**

వికారాబాద్ మణప్పురం గోల్డ్ లోన్ దొంగను పోలీసులు పట్టుకున్నారు. వికారాబాద్ మణప్పురం గోల్డ్‌లోన్ బ్రాంచ్ మేనేజర్ విశాల్‌నే బంగారాన్ని దోచేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. వికారాబాద్ జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి శుక్రవారం మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. మణప్పురం గోల్డ్‌లోన్ వికారాబాద్ బ్రాంచ్‌లో కస్టమర్లు దాచిన బంగారు వస్తువులు కనిపించడం లేదని అడిట్ అధికారులు గుర్తించారు. వికారాబాద్ మణప్పురం గోల్డ్‌లోన్ బ్రాంచ్ మేనేజర్ విశాల్‌పై అనుమానంతో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. విశాల్‌కు జలసాలతో పాటు ఆన్‌లైన్ గేమ్స్ ఆడటం అలవాటుగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. బీదర్ జిల్లా అవురద్ తాలుకా అనంతపురం గ్రామానికి చెందిన విశాల్ 2023నుంచి వికారాబాద్ బ్రాంచ్ మేనేజర్‌గా విశాల్ పని చేస్తున్నాడు. వికారాబాద్ మణప్పురం గోల్డ్ లోన్ బ్రాంచ్‌లో తన బంధువులు, స్నేహితుల పేరుతో ఫేక్ ఐడిలు సృష్టించి లోన్ తీసుకున్నట్లుగా తన ఖాతాలోకి మేనేజర్ విశాల్ డబ్బు పంపుకున్నాడు. మొత్తం 63 ప్యాకెట్లలోని గోల్డ్ దాదాపు రూ.2కోట్ల 20లక్షల విలువైన గోల్డ్‌ను విశాల్ దొంగతనం చేశాడు. విశాల్‌ను అదుపులోకి తీసుకొని తన ఇంట్లో తనిఖీలు చేయగా 83గ్రాముల బంగారం, 10 లక్షల నగదు స్వాధీనం చేసుకొని ప్రత్యేక టీం అదుపులోకి తీసుకుంది. కస్టమర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యాజమాన్యం చర్యలు తీసుకుంటుందని పోలీసులు స్పష్టం చేశారు. నిందితుడు విశాల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

# విద్యుత్ షాక్‌తో ఇల్లు దగ్ధం






**ప్రజాభూమి ప్రతినిధి, దౌల్తాబాద్ :**

ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో పెంకుటిల్లు పూర్తిగా దగ్ధమైన సంఘటన దౌల్తాబాద్ మండలం గాజులపల్లి గ్రామంలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం దౌల్తాబాద్ మండలం గాజులపల్లి గ్రామానికి చెందిన మారుపాక అర్జున్ కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఊరికి వెళ్లడంతో గురువారం ఇంట్లో ఎవరూ లేరు. అదే రోజు అర్ధరాత్రి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో పెంకుటిల్లు పూర్తిగా దగ్ధమైంది. తెల్లవారుజామున స్థానికులు ఇంట్లో నుంచి పొగలు వస్తున్నాయని గమనించి అర్జున్ వాళ్లకు సమాచారం అందించారు. అప్పటికే దాదాపుగా ఇల్లు మొత్తం కాలిపోయింది. వాళ్లు ఊరు నుండి వచ్చి చూసేసరికి పెంకుటిల్లు పూర్తిగా దగ్ధమై ఇంట్లో ఉన్న వస్తువులన్నీ ఖాలిపోయాయి. అర్జున్ కుటుంబ సభ్యులు ఎవరు కూడా ఇంట్లో లేకుండా ఊరికి వెళ్లడంతో ప్రాణాపాయం తప్పింది. కానీ ఇంట్లో ఉన్న రూ.2 లక్షల నగదు, తులం బంగారం, 20 తులాల వెండి, బియ్యం, నిత్యవసర సరుకులు, బట్టలు, ఇంట్లో ఉన్న ఇతర వస్తువులన్నీ పూర్తిగా దగ్ధమైనట్లు బాధితులు తెలిపారు. ఈ సంఘటన చూసి అర్జున్ కుటుంబం మొత్తం శోకాసంద్రంలో మునిగిపోయింది. నివాసం ఉండడానికి కనీసం గూడు లేకుండా పూర్తిగా మంటల్లో ఖాలిపోయేసరికి కన్నీరు మున్నీరవుతున్నారు. అనంతరం రెవెన్యూ అధికారులకు సమాచారం అందించడంతో దౌల్తాబాద్ మండల ఆర్ ఐ ప్రభాకర్ రావు సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. నివేదికను ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. గ్రామస్తులు ప్రభుత్వం కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# దౌల్తాబాద్‌లో ఘనంగా దీపావళి వేడుకలు



**ప్రజాభూమి ప్రతినిధి, దౌల్తాబాద్:**

దీపావళి పర్వదినం పురస్కరించుకొని దౌల్తాబాద్ మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఉత్సాహంగా వేడుకలు నిర్వహించుకున్నారు. గురువారం ఉదయం దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు. పశువులను సుందరంగా ముస్తాబు చేసి హారతి ఇచ్చారు. అలాగే ఇండ్లను సుందరంగా ముస్తాబు చేసి అలంకరించుకున్నారు. అమావాస్య రోజున చీకటిని ప్రాలదోలి అందరి జీవితాల్లో వెలుగులు విరజిమ్మాలని దీపావళి జరుపుకుంటారు. అందరి ఇళ్లల్లో ప్రత్యేకంగా తీపి వంటలు స్వీట్ లు తయారు చేసుకొని కుటుంబ సభ్యులందరి కలిసి ఆనందంగా గడిపారు. చిన్నారులు, యువకులు టపాకాయలు కాలుస్తూ సంతోషంగా దీపావళి నిర్వహించుకున్నారు.

# ఎమ్మెల్యే మల్లారెడ్డికి దీపావళి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



**ప్రజాభూమి ప్రతినిధి, శామీర్‌పేట :**

దీపావళి పండుగ సందర్భంగా మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిని శామీర్‌పేట మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సరసం మెహన్ రెడ్డి, నాయకులు లాల్లయ్య, యూత్ నాయకుడు వంగ వెంకటరెడ్డిలు గురువారం ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# 'కుబేర'.. టీజర్‌తో సిద్ధం



కథానాయకులు ధనుష్, నాగార్జున ప్రధాన పాత్రల్లో శేఖర్ కమ్ముల తెరకెక్కిస్తున్న బహుభాషా చిత్రం 'కుబేర'. సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్ మోహన్‌రావు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రష్మిక కథానాయిక. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా టాకీ పార్ట్ పూర్తి చేసుకున్నట్లు చిత్ర వర్గాలు ప్రకటించాయి. ఈ నెల 15న టీజర్‌ను విడుదల చేయనున్నట్లు వెల్లడించాయి. ఈ మేరకు దీపావళి సందర్భంగా శుక్రవారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఆ ప్రచార చిత్రంలో నాగ్, ధనుష్, రష్మిక కనిపించిన తీరు ఆసక్తి రేకెత్తించేలా ఉంది. సోషల్ డ్రామా కథాంశంతో రూపొందుతోన్న ఈ చిత్రం ఓ పాట చిత్రీకరణతో పూర్తి కానుంది. నిర్మాణానంతర పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇది త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.



# సంక్రాంతికి వస్తున్నారు

కథానాయకుడు వెంకటేశ్.. దర్శకుడు అనిల్ రావిపూడి కలయికలో ఓ చిత్రం రూపొందుతోంది. దిల్‌రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్నారు. ఐశ్వర్య రాజేశ్, మీనాక్షి చౌదరి కథానాయికలు. ఈ సినిమాకి అందరూ అనుకున్నట్లుగానే 'సంక్రాంతికి వస్తున్నాం' అనే పేరునే ఖరారు చేశారు. ఈ మేరకు శుక్రవారం ఈ చిత్ర టైటిల్, ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ఆ ప్రచార చిత్రంలో వెంకీ పంచెకట్టులో తుపాకీ పట్టుకుని ఉండగా.. తనకు ఓవైపున సతీమణిగా ఐశ్వర్య రాజేశ్, మరోవైపున మాజీ ప్రేయసిగా మీనాక్షి కనిపించారు. ఇదొక వినూత్నమైన ముక్కోణపు క్రైమ్ కథాంశంతో రూపొందుతోంది. థ్రిల్, వినోదం మిళితమై సాగుతుంది. ముగింపు దశ చిత్రీకరణలో ఉన్న ఈ సినిమా సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతమందిస్తున్నారు. సమీర్ రెడ్డి ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.

## నా కెరీర్‌లో నమ్మలేని క్షణాలివి!



'కంగువా'తో మరికొద్ది రోజుల్లో అగ్రకథానాయకుడు సూర్యతో కలిసి తెరపై సందడి చేయడానికి సిద్ధమవుతోంది బాలీవుడ్ తార దిశా పటాని. ఈ ఫాంటసీ యాక్షన్ చిత్రంలో ఏంజెలీనా అనే పాత్రలో సందడి చేయనుందామె. ప్రచార కార్యక్రమంలో భాగంగా.. ఈ చిత్రంలో నటించడం గురించి తన ఉత్సాహాన్ని పంచుకుంది దిశ. "నా కెరీర్‌లో ఇప్పటికీ నమ్మశక్యం కానీ క్షణాలు ఇవి. ఎందుకంటే నేను ఈ చిత్రంలో అద్భుతమైన వ్యక్తులు, దర్శకుడు, నటులతో కలిసి పని చేశాను. తక్కువ సమయంలోనే మేమంతా ఒక కుటుంబంలా అయ్యాము. చిత్రబృందం సహకారంతోనే ఎన్ని సవాళ్లు ఎదురైనా చిత్రీకరణను పూర్తిచేయగలిగాను. తన సినిమాలో నటీనటులు సెట్స్‌కి వచ్చినప్పుడు సంతోషంగా పనిచేసుకోవాలని కోరుకుంటున్నాని దర్శకుడు శివ నాకు తొలి రోజే చెప్పిన మాటలు ఇవి. షూటింగ్ సమయంలో నన్ను ఎంతో జాగ్రత్తగా చూసుకున్నారు. సూర్యతో కలిసి పనిచేయడం నా జీవితంలో మర్చిపోలేని ఓ మంచి అనుభవం. ఆయన కంటే తన కళ్లు ఎక్కువగా మాట్లాడతాయి. ఆయన నుంచి ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చు. బాబీదేవోల్, జగపతి బాబు.. ఇలా చాలా మంది లెజెండ్స్‌తో కలిసి పనిచేయడం నా అదృష్టంగా భావిస్తున్నాన"ని చెప్పుకొచ్చింది. శివ దర్శకత్వం వహించిన ఈ చిత్రం నవంబరు 14న విడుదలకు సిద్ధంగా ఉంది.



## కుమార్తె పేరు ప్రకటించిన దీపికా పదుకొణె..

# అర్థమేంటో తెలుసా?

దీపికా పదుకొణె రణ్‌వీర్ సింగ్ తమ ముద్దుల తనయ పేరును ప్రకటించారు. దువా పదుకొణె సింగ్ అని నామకరణం చేసినట్టు సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. "దువా అంటే ప్రార్థన. మా ప్రేయర్స్‌కు సమాధానమే ఈమె" అని పేర్కొంటూ చిన్నారి కాళ్లను ఫొటో తీసి షేర్ చేసుకున్నారు. దీనిపై అభిమానులతో పాటు అలియా భట్, మమితా బైజు, షాలినీ పాండే తదితర సినీ ప్రముఖులు స్పందించారు. 'క్యూట్' అంటూ లవ్ ఎమోజీలు జోడించారు. రణ్‌వీర్ దీపికా 2018లో వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. ఈ ఏడాది సెప్టెంబరులో దీపికా.. పండంటి ఆడ శిశువుకు జన్మనిచ్చారు. దీపావళి పండగను పురస్కరించుకుని తొలిసారి చిన్నారి ఫొటోను పంచుకోవడంతోపాటు పేరునూ ప్రకటించారు. 'కల్కి 2898 ఏడీ'తో అలరించిన దీపికా.. 'సింగమ్ అగైన్'తో మరోసారి ఆడియన్స్ ముందుకొచ్చారు. ఈ చిత్రం శుక్రవారం విడుదలైంది. ఇందులో రణ్‌వీర్ అతిథి పాత్రలో సందడి చేశారు. మరోవైపు, 'ధురంధర్' సినిమాతో బిజీగా ఉన్నారు.

printed& Published &edited by Chandra shekar vippala, from Adhya publications, hyderabad, phone no... 9951121243 (Trial version)